క్లుప్తంగా

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన

తెనాలి: సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ముస్లిం సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను నిర్వహించారు. స్థానిక శివాజీ సెంటరులోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయం, జామియా మసీదు వద్ద నుంచి ప్రదర్శనను ప్రారంభించారు. లిబరేషన్ దేశవ్యాపిత పిలుపులో భాగంగా చేపట్టిన ప్రదర్శన గాంధీచౌక్, బోసురోడ్డు, చినరావూరు పార్కు వరకు కొనసాగింది. యుద్ధం వద్దు... శాంతి కావాలి, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఆపాలి అంటూ నినాదాలు చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మూర్తి, జిల్లా కార్యదర్శి ఎంపీ రాందేవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణకృష్ణ, లోకం భాస్కరరావు, ముస్లిం సంస్థల నేతలు పాల్గొన్నారు.

ఆహూతులను అలరించిన లలితా చంద్రశేఖర్ గానం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత సంస్థ శ్రీసీతారామ గానసభ శాస్త్రీయ సంగీత ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం సాయంత్రం విశాఖపట్నంకు చెందిన ప్రముఖ గాయని వీరఘంట లలితా చంద్రశేఖర్ గాత్రకచేరీ ఆహూతులను అలరించింది. ప్రధానంగా మైసూర్ వాసుదేవాచారి కీర్తన, త్యాగరాజస్వామి కీర్తనలను శృతిపర్వంగా, లయబద్ధంగా ఆలపించారు. వీరి గాత్రానికి విజయనగరంకు చెందిన సోదరులు మహాదాసు నీలాద్రి వయోలిన్‌పై, మహాదాసు ఏడుకొండలు మృదంగంపై సహకరించారు. గానసభ అధ్యక్షులు పిరాట్ల రమణి, కార్యదర్శి దుర్భా హరిబాబు, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

నూతన వస్త్రాల పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన బిషప్ పాముల బిజయ్య 3వ వర్ధంతిని మంగళవారం స్థానిక అయితానగర్– జయప్రకాష్‌నగర్‌లోని పల్లికొండ వారి వీధిలోని మైకా చర్చిలో ఘనంగా నిర్వహించారు. దైవజనులకు నూతన వస్త్రాలను బహూకరించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులైన చిన్నారులకు ప్రొవిజన్స్‌ను అందజేశారు. బిషప్ బిజయ్యా సతీమణి పి.రవికుమారి, పి.రిచర్డ్, పి.జస్టిస్, పి.అనూష, పాముల రూజ్‌వెల్ట్, అక్కిదాసు కిరణ్‌కుమార్, కె.అనిల్, యు.సునీల్, బి.దాసు, దైవజనులు ఎం.రామకృష్ణ, జాన్సన్, కె.సంసోను, పి.ప్రసంగి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లో రావెల విద్యార్థినుల ప్రతిభ



రావెల(తాడికొండ): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యోగా టోర్నమెంట్‌లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపారని పాఠశాల హెచ్ఎం నాగమణి, ఆయుష్ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసం గ్రామంలో ఈనెల నిర్వహించిన అండర్–17 యోగా పోటీలకు బాలికల విభాగంలో విద్యార్థులు పాల్గొనగా, వారిలో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు జట్టును విజయ పథంలో నడిపించడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులు పేరుబోయిన వెంకట త్రివేణి, మొఘల్ ఖాజాబీ, పేరుబోయిన భార్గవి, మొక్కల అక్షయలతో పాటు వారికి శిక్షణ అందించిన శిక్షకుడు అన్నవరపు రాకేష్‌ను హెచ్ఎం నాగమణి, వైద్యాధికారిణి డాక్టర్ రేష్మలు అభినందించారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మార్కెట్ మసీదు వద్ద నివాసముండే ఓ మహిళ కనిపించడం లేదంటూ మంగళవారం ఆమె భర్త తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లి మార్కెట్ వద్ద నివాసముండే వెల్డింగ్ పనిచేసే తోకల దుర్గారావుకు అదే ప్రాంతానికి చెందిన త్రివేణికి 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. గత నెల 30వ తేదీన వీరిద్దరి మధ్య వివాదం తలెత్తడంతో మనస్తాపం చెందిన త్రివేణి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో దుర్గారావు తన భార్య కనిపించడంలేదంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

చిన్నతిరుపతిగా విలసిల్లుతోన్న 'వైకుంఠపురం'

- రేపు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం
- ఆలయ చరిత్రలో తొలిసారిగా గౌడ సంఘీయులకు అవకాశం



వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం



ముక్కోటి ఏకాదశి పర్వదినాన కిటకిటలాడుతుండే దేవాలయం

తెనాలి: వైకుంఠపురం దేవస్థానం దేశంలోని పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా, ఇక్కడి ప్రజలకు చిన్న తిరుపతిగా విలసిల్లుతోంది. పట్టణానికి దక్షిణంగా ప్రశాంత వాతావరణంలో ఉందీ ఆలయం. నిత్య కల్యాణం పచ్చతోరణంగా సేవలందుకుంటున్న కలియుగ నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు, భక్తాభీష్ట వరదుడై లక్ష్మీపద్మావతి సమేతంగా, పరమ ప్రసన్న శోభను చిందిస్తూ, బహుముఖ వైభవోపేతుడై వెలుగొందుతున్నాడు. వేలాది భక్తులు, దాతల వితరణ, పాలకవర్గాల కృషితో పవిత్ర యాత్రాస్థలంగా శోభిల్లుతోంది. ఆలయ నూతన ధర్మకర్తల మండలి ఈనెల 9న ప్రమాణస్వీకారం చేయనుంది. ఆలయ చరిత్రలో తొలిసారిగా గౌడ సంఘీయులకు ఛైర్మన్ పదవి దక్కటం విశేషం.

సంస్థాపకుడు బాలనరసింహారావు గౌడ్

పరమ భక్తుడు. పరంధాముడైన శ్రీవేంకటేశ్వరుడు నాగేంద్రుని రూపంలో ఆయన కలలోకి వచ్చి, రేపల్లె రైల్వేవంతెన సమీపంలో వెలిశానని తెలిపారు. , నాగరాజు రూపాన భక్తులకు స్వాయంగా సాక్షాత్కారమందించి, వారిని నానాముఖ కామితార్థమును అందిస్తానని చెప్పుకొచ్చారు. అక్కడ తనకొక దేవాలయం నిర్మించాలని ఆజ్ఞాపించి, అంతర్ధానమయ్యాడు. తాను కొలిచే స్వామి ఆజ్ఞాపించాక, కానిదేముంది? బాలనరసింహారావు గౌడ్ స్వప్నం సత్యమైంది. సంకల్పం సర్వతోముఖమైంది. 1961లో ఇక్కడ స్థలం అభివృద్ధి చేసి భక్తుల సహకారంతో 1972లో ఆగమ శాస్త్రానుసారంగా, బహుముఖ శిల్ప చిత్రాచిత్రంగా రమణీయమైన దేవాలయ నిర్మాణం పూర్తిచేసి, విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

➡ భక్తుల ఆదరణతో ఆ మరుసటి ఏడాది అంటే 1973లో ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. ఏటికేడాది భక్తుల సంఖ్య పెరుగుతూ కోరిన కోర్కెలు తీరుస్తున్న ఇలవేలుపుగా, భక్తుల కొంగు బంగారంగా శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ పూజలు అందుకుంటున్నాడు. భక్తుల సంఖ్య, ఆలయ ఆదాయం ఏటేటా వర్ధిల్లింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నుంచి 1999లో సహాయ



స్వామివారి ఉత్సవ విగ్రహాలు

కమిషనరు హోదా లభించింది. నిత్యపూజలతో పాటు ప్రతి శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజలు జరిగే ఆలయంలో ఏటా వైశాఖ మాసం నుంచి బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలను కమనీయంగా నిర్వహిస్తున్నారు. పుష్యమాసంలో వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారదర్శనం, సంక్రాంతికి తెప్పోత్సవం వైభవంగా చేస్తున్నారు. తిరుమల తరహాలో పుష్పయాగం, పవిత్రోత్సవాలను 15 ఏళ్ల క్రితమే ప్రారంభించారు. నిత్యాన్నదాన పథకం ఇక్కడ అమలవుతోంది.

➡ ఆలయం 4.36 ఎకరాల్లో ఉండగా, ఇందులో 1.60 ఎకరాల్లో ప్రధాన ఆలయం, షాపింగ్ కాంప్లెక్స్, కార్యాలయం ఉన్నాయి. మిగిలిన 2.70 ఎకరాల్లో భక్తుల కోసం శ్రీనివాస సదన్, పద్మావతి సదనం, శ్రీనివాస కల్యాణ మండపం, పూర్ణ కళాక్షేత్ర మండపం, పద్మావతి కళ్యాణ మండపం నిర్మించారు. ఇందులో ఒక కళ్యాణమండపంలో భక్తులకు ఉచితంగానే వసతిని కల్పిస్తున్నారు. వరాహస్వామి ఆలయం, సర్వాభీష్ట నాగేంద్ర స్వామి, గరుత్మంతుడు, నృత్యగణపతి విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఆలయంలో విధుల నిర్వహణకు సిబ్బంది, అర్చకులు కలిపి 30 మందికి పైగా ఉన్నారు. శ్రీవేంకటేశ్వరుడి ఆదాయం పూజా టికెట్లు, హుండీ, షాపింగ్ కాంప్లెక్సులు, కేశ ఖండనశాల వేలం హక్కులు, దాతల విరాళాలే ప్రధానం. ఏటా రూ.కోటి పైగానే సమకూరుతున్నాయి. 2009–10లో రికార్డుస్థాయిలో రూ.1.76 కోట్ల వరకు వచ్చాయి. స్వామివారికి సుమారు 4.5 కిలోల బంగారం, 138 కిలోల వెండి ఆభరణాలున్నాయి. నిధులు రూ.60.75 లక్షలు, అన్నదాన నిధి కింద మరో రూ.48.57 లక్షలు ఉన్నాయి.

➡ టీడీపీ హయాంలో ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిన ఆలయానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హనుమాన్ సేవకుడు వుప్పల వరదరాజులు అధ్యక్షతన ఏర్పాటైన ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో భక్తులను విశేషంగా ఆకర్షించారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా రథసప్తమికి తిరుమల తరహాలో సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు సప్తవాహన సేవలు, గ్రామోత్సవాన్ని ఆరంభించారు. సంగీత మంటపాన్ని నిర్మించారు. బ్రహ్మోత్సవాల తర్వాత స్వామివారి శ్రీచక్ర స్నానానికి వీలుగా కోనేరు నిర్మించారు.

భక్తుల సంఖ్య పెరగటంతో హుండీ ఆదాయం రెట్టింపయింది. ఆలయ వ్యవస్థాపకుడు గౌడ సంఘీయుడైనా, ఇప్పటివరకు ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఆ వర్గీయులకు అవకాశం లభించనే లేదు. దీనిని గుర్తించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు గౌడ సంఘీయుడైన, ఇంజినీరు కుంభా సాయిబాబు గౌడ్‌కు ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు.

ఆలయ ధర్మకర్తల మండలి వీరే...

నూతన కమిటీ ఛైర్మన్‌గా కుంభా సాయిబాబు గౌడ్, సభ్యులుగా కనికిచర్ల చరణ రత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత, బొద్దులూరి సరస్వతి, మావులూరి శ్రీనివాస్, ముంతా దుర్గాప్రసాద్, బట్టు దుర్గారావు, దేవరకొండ వెంకటరమణలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

మాట నిలుపుకున్నారు



వైకుంఠపురం దేవాలయ ప్రతిష్ఠ చేసింది గౌడ సంఘీయుడు. నాటినుండి నేటివరకు గౌడ వర్గానికి ఏనాడై ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా అవకాశం దక్కలేదు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇప్పుడు నాకు అవకాశం కల్పించారు. మా సంఘీయుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తా.

– కుంభా సాయిబాబు గౌడ్, ఛైర్మన్, ధర్మకర్తల మండలి, వైకుంఠపురం

బుర్రిపాలెం దళితవాడల్లో మంచినీటి పంపు ఏర్పాటు



తెనాలిటౌన్: రూరల్ మండలం బుర్రిపాలెంలోని దళితవాడలో విజన్ ఆఫ్ హోప్ మిషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి పంపును మంగళవారం తెనాలి రూరల్ ఎస్ఐ ప్రసన్నకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేద ప్రజలు నివాసించే ప్రాంతంలో మంచినీటి సౌకర్యం కల్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మిషన్ ప్రెసిడెంట్ అముర్తూరి రవీంద్రబాబు, ఎ.అశోక్‌కుమార్, కంచర్ల అనిల్, రమేష్, నాగరాజు, గార్నెపూడి సన్నీబాబు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీ రంగాకు పుష్పాంజలి



తెనాలి: సీనియర్ పార్లమెంటేరియన్, రైతునాయకుడు ఎన్‌జీ రంగా జయంతి సందర్భంగా మంగళవారం అయితానగర్‌లోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రంగా వ్యక్తిత్వాన్ని, ఆయన రైతులోకానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి వెంకటేశ్వరరావు, ఈదర పిచ్చయ్యచౌదరి, కన్నెగంటి శివ, అంచే ప్రసాద్, ఈదర రాజా, శాఖమూరి చలపతిరావు, గుమ్మడి ప్రసాద్, ఈదర శ్రీనివాసరావు, ఈదర రమణ, జి.లచ్చిబాబు, మేకల చిట్టిబాబు, ఈదర శివశీను, తాళ్లూరి కిషోర్, తాళ్లూరి కామయ్య, కన్నెగంటి వెంకట్రావు, జెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసిన వారికే మాదిగ మద్దతు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

తెనాలిటౌన్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసిన రాజకీయ పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందని, వర్గీకరణ కోసం పోరాటం చేస్తునే సంక్షేమం, సమగ్రాభివృద్ధి, రాజకీయ వాటా కొరకు మాదిగలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. కొత్తపేటలోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ పొన్నెకంటి రమేష్‌మాదిగ అధ్యక్షత వహించారు. సమావేశంలో బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగల ఆశ, ఆకాంక్ష, ఎస్సీ వర్గీకరణ అని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభలో దేశ ప్రధాని నరేంద్రమోడీ పాల్గొంటారని చెప్పారు. పార్లమెంట్‌లో వర్గీకరణ అంశంపై చట్టం చేయాలని బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్ మాదిగ, ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, దొండపాటి సుధాకర్, పానుగంటి షాలేమ్ రాజు, డొక్కా జార్జి, మహిళ నాయకులు లుక్కా బుజ్జి, ప్రశాంతి, నాగమ్మ, యువకులు జాన్‌పాల్, రమేష్, సంతోష్, జాన్‌వెస్లీ, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణ స్థలాల పరిశీలన



అమరావతి రోడ్డులో గల దేవదాయ శాఖ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసుకునే బాణ సంచా షాపులు తప్పనిసరిగా నిర్ణయించిన స్థలాల్లోనే ఏర్పాటు చేయాలని అధికారులు వ్యాపారులకు తేల్చిచెప్పారు. మంగళవారం తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు దేవదాయ శాఖ స్థలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాణ సంచా వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే ఉండవల్లి అమరావతిరోడ్డులో గల దేవాలయ భూముల్లో షాపులు ఏర్పాటు చేసుకోవాలని, ఆ షాపు ఏర్పాటు చేసేటప్పుడు పై కప్పుగా రేకులను మాత్రమే వినియోగించాలని, నిర్ణయించిన స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను నిర్ణయించిన ప్రదేశంలో పార్కింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నారని, విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారని అన్నారు. ఈ పరిశీలనలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, అగ్నిమాపకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తాడేపల్లి ఎస్ఐ రమేష్, ఆర్ఐ వంశీకృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈ షణ్ముఖ పాల్గొన్నారు.

పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన



పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌సీఐ తాడేపల్లి కృష్ణాకెనాల్ డిపో మేనేజర్ వర్గీస్

తాడేపల్లిరూరల్: పోర్టిఫైడ్ బియ్యం వినియోగంలో అపోహలు వద్దని ఎఫ్‌సీఐ తాడేపల్లి కృష్ణాకెనాల్ డిపో మేనేజర్ వర్గీస్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆహార సంస్థ ఆహార నిల్వల గోదాము, కృష్ణా కెనాల్ డిపో ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటైన ఆహార లోపాన్ని నిర్మూలించడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోర్టిఫైడ్ బియ్యం వాడడం వలన రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చని తెలియజేశారు. కృష్ణాకెనాల్ ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శశికళ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కావాల్సిన ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బీ12లు ఈ బియ్యంలో లభ్యమవుతాయని వివరించారు. ఆశా వర్కర్లు పోర్టిఫైడ్ బియ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మెడికల్ ఆఫీస్ డాక్టర్ కిరణ్, సిహెచ్ గురుకుమార్, సి.వ్రూజా, ఉమాదేవి, ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్‌బాబు, తాడేపల్లి కేసీ డిపో సిబ్బంది, క్వాలిటీ సిబ్బంది, ఆశావర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సీవీ రామన్ స్ఫూర్తితో శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశం గర్వించే గొప్ప శాస్త్రవేత్త సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థినులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి సూచించారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ జయంతిని మంగళవారం సాంబశివపేటలోని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థినులు బయో సెన్సార్, నానో మెటీరియల్స్ ఇన్ టెక్స్‌టైల్స్ అండ్ త్రీడీ ప్రింటింగ్ అంశాలపై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలు జి. శిరీష, డాక్టర్ జె. నిశ్చల్ కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ



తెనాలిటౌన్: పట్టణ గాంధీనగర్‌లోని నరేంద్రకాలనీలో మున్సిపల్ ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. యోగా సభ్యులు చరసాని శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీ చైతన్యల కుమారుడు వివిఎస్.రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కఠెవరం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంపల శివనాగేశ్వరరావు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జరీనా బేగం, సాంబశివరావు, ఉపాధ్యాయులు సుజాత, మాధవి, శిరీషా, నరేంద్రబాబు, కెథారీన్, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

నేడు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం ప్రారంభం

గుంటూరు మెడికల్: ఆమ్ ఆద్మీ పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయాన్ని బుధవారం మంగళగిరి రోడ్డులోని వైష్ణవి కాంప్లెక్స్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ టి.సేవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం ఓటర్ల లిస్టు అందుబాటులో ఉంటుందని, ఓటరు సహాయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఓటర్లంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో పీపీటీ ఫెస్ట్



మాట్లాడుతున్న అమరేశ్వరరావు

తెనాలిటౌన్: పాఠ్యాంశాలలో లోతైన అవగాహనకు, పరిశీలనకు పీపీటీ ప్రజంటేషన్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని ప్రియదర్శిని డిగ్రీ అధ్యక్షులు బొల్లిముంత అమరేశ్వరరావు తెలిపారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో మంగళవారం పీపీటీ ప్రజంటేషన్‌ల పోటీలు జరిగాయి. పోటీలను అమరేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ పాఠ్యాంశాలలో ముఖ్యాంశాలను, సమకాలిన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను పీపీటీల రూపంలో విద్యార్థులు రూపొందించి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరం కళాశాలలో క్రమం తప్పకుండా పీపీటీ ఫెస్ట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలల్లో విద్యార్థులు నెట్‌వర్కింగ్, 5జీ, సోషల్ మీడియం, వర్చువల్ రియాల్టీ తదితర అంశాలపై రూపొందించిన పీపీటీలను ప్రదర్శించి నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, కంప్యూటర్ అధ్యాపకులు వేదాంతం శ్రీ సుధ, నయాబ్ రసూల్, ఆరీఫా పాల్గొన్నారు.

వానర గోలకు వేషంతో చెక్!



ఇళ్లపై దాడి చేసి, అక్కడ దొరికింది ఎత్తుకెళ్లడం .. దారిన పోయేవారిపై దాడిచేసి, చేతుల్లో ఏముంటే అది లాకెళ్లిపోవడం.. చిన్నారులు, మహిళల వెంటపడి మరీ కరవడం.. ఇలా కోతులు చేసే భీభత్సం అందరికీ తెల్సిందే.. అవి మూకగా దాడిచేశాయంటే ఎంతటివారైనా పలాయనం చిత్తగించాల్సిందే.. అయితే వానరాల పీడకు వినూత్న ఆలోచనతో చెక్‌పెట్టారు తాడికొండ గ్రామ పంచాయతీ పాలకవర్గం. గ్రామంలో కోతుల బాధ భరించలేక ఆన్‌లైన్‌లో కొండముచ్చు సూట్‌ను తెప్పించి, పంచాయతీ వర్కర్‌కు వేయించి, కోతులు అధికంగా ఉన్న ప్రాంతంలో తిప్పారు. భారీసైజులో ఉన్న కొండముచ్చు వేషధారిణిని చూసి బెంబేలెత్తిపోతున్న వానరమూకలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోతున్నాయి. ఈ ఆలోచన సత్ఫలితాలు ఇవ్వడంతో మరో కొండముచ్చు డ్రెస్ తెప్పిస్తున్నట్లు సర్పంచ్ తోకల సరోజిని, కార్యదర్శి పిట్టు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

– తాడికొండ

నీరే జీవితం.. జీవితమే నీరు

నెహ్రూనగర్: నీటి శుభ్రతపై మహిళలు అవగహన కలిగి ఉండాలని మెప్మా పీడీ పి. వెంకట నారాయణ, నగరపాలక సంస్థ డీఈఈ హనీఫ్ తెలిపారు. అమృత్ 2.0, దీన దయాళ్ అంత్యోదయ యోజన కార్యక్రమంలో భాగంగా నేషనల్ లైవ్‌లీ హుడ్ మిషన్ ఆధ్వర్యంలో 'నీటి దీపావళి' పేరిట నీళ్ల కోసం మహిళలు, మహిళలు కోసం నీళ్లు అనే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగా మంగళవారం తక్కెళ్లపాడులోని హెడ్ వాటర్ వర్క్స్‌లో మహిళలకు నీటి శుద్ధీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన నీరు తాగాలని సూచించారు. నీరే జీవితం ...జీవితమే నీరని పేర్కొన్నారు. ప్లాంటులో నీటి శుద్ధీకరణ ప్రక్రియను మహిళలకు దగ్గరుండి డీఈఈ హనీఫ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ సాంబశివరావు, సీఎంఎం నాయక్, లత, ప్రభావతి పాల్గొన్నారు.

దోగిపర్రు ఉర్దూ పాఠశాలలో తనిఖీలు



మేడికొండూరు: మండల పరిధిలోని దోగిపర్రులోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం మంగళవారం తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు వర్క్‌ను పరిశీలించి అభినందించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత ఉండేలా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.